



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
ఫిబ్రవరి 15, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


మహా కుంభమేళాకు 50 కోట్లు దాటిన భక్తులు...

## ఆ ఒక్కరోజే 8 కోట్ల భక్తుల పుణ్యస్నానాలు



- ఈరోజు సాయంత్రానికి 50 కోట్లు దాటినట్లు తెలిపిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం
- జనవరి 29న మౌని అమావాస్య రోజు అత్యధికంగా భక్తులు వచ్చినట్లు వెల్లడి
- అమెరికా, రష్యా, ఇండోనేషియా, బ్రెజిల్, పాక్, బంగ్లాదేశ్ జనాభా కంటే కుంభమేళా భక్తులు ఎక్కువ అన్న ప్రభుత్వం

## తెలంగాణ కాంగ్రెస్ నూతన ఇంఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్

ఢిల్లీ: తొమ్మిది రాష్ట్రాలకు ఇంఛార్జ్‌లను ఏఐసీసీ ప్రకటించింది. దీపాదాస్ మున్షీ స్థానంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్‌ను నియమిస్తూ ఏఐసీసీ ఆదేశాలు జారీ చేసింది. 2009లో మధ్యప్రదేశ్ మాండసోర్ నుంచి ఎంపీగా మీనాక్షి నటరాజన్ పనిచేశారు. హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, జార?ండ్, మణిపూర్, బీహార్ రాష్ట్రాలకు కొత్త ఇంఛార్జ్‌లను ఏఐసీసీ నియమించింది. పంజాబ్, జమ్మూకశ్మీర్‌లకు కొత్త జనరల్ సెక్రటరీలను కూడా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది.



# మోదీ పుట్టుకతో బీసీ కాదు



- కాంగ్రెస్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ఆయన కులం గతంలో ఉన్నత వర్గాల్లో ఉండేది.. గుజరాత్‌కు సీఎం అయ్యాక కులాన్ని బీసీల్లో కలిపారు
- ఇత్తేసి పొత్తు కుదిరారు.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ
- జనాభా లెక్కలు చెప్పని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు లేదు
- కులగణనపై డిప్యూటీ సీఎం భట్టి, వర్గీకరణపై మంత్రి దామోదర పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీని ఉద్దేశించి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ పుట్టుకతో బీసీ కాదని, ఆయన కులం గతంలో ఉన్నత వర్గాల్లో ఉండేదని, గుజరాత్‌కు సీఎం అయ్యాక ఆయన తన కులాన్ని బీసీల్లో కలిపి ఇత్తేసి పొత్తు కుదిరాడని అన్నారు. మోదీ సర్టిఫికెట్ మాత్రమే బీసీదని, మనస్తత్వం ఇందుకు వ్యతిరేకమని విమర్శించారు. తాను బీసీ ప్రధానిని కనుక ఇక ఎవరూ అవసరం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులపై కూడా సీఎం విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జనాభా లెక్కలు చెప్పని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు లేదని అన్నారు. మరోమారు నిర్వహిస్తున్న కులగణనలో అయినా వివరాలు ఇవ్వకపోతే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు సామాజిక బహిష్కరణే శిక్ష అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ సమావేశంలో తీర్మానం చేస్తున్నామని, అందరూ ఆమోదించాలని కోరారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కులగణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలో కులగణన చేసిన తీరును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎస్సీలను వర్గీకరించిన తీరును మంత్రి దామోదర రాజనర్సింహ.. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పారదర్శకంగా కులగణన: 'దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రెండు సమస్యలకు పరిష్కారం చూపే దిశలో మేం ప్రయత్నిస్తుంటే ప్రత్యర్థి రాజకీయ పక్షాలు, ఆ పార్టీల నేతలు ఆరోపణలతో, లేనిపోని అపోహలు సృష్టిస్తూ కుల గణన తప్పుల తడక అనే అభిప్రాయం కలిగించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. దేశ వ్యాప్తంగా కులగణన జరిగి బలహీన వర్గాల లెక్క తేల్చి వారి కోటా, వాటా వారికివ్వాలనేది రాహుల్‌గాంధీ ఆలోచన. ఆ దిశలోనే ముందుకెళ్లి తెలంగాణ ప్రజలకు రాహుల్ ఇచ్చిన మాటను నిలబెట్టేందుకు పారదర్శకంగా కులగణన చేశాం.

**గ్యాంబ్లర్స్‌కు కులగణన ఇష్టం లేదు..**

కేసీఆర్ గతంలో కాకి లెక్కలతో సర్వే చేశాడు. చెట్ల మీద విస్తరాకులు కుట్టి ఇదే బైబిల్, ఖురాన్,

(మిగతా 2వ పేజీలో)

# రెండేళ్లలో సమీకృత గురుకులాలు

- 105 నియోజకవర్గాల్లో 105 స్కూళ్ల నిర్మాణం పూర్తవ్వాలి
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'పై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం
- ప్రతిపాదిత స్కూల్ స్థలాలను వెంటనే పరిశీలించాలి..
- రాకపోకలకు అనువుగా ఉన్న ప్రాంతాలను ఎంచుకోవాలి
- వారంలో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశం



హైదరాబాద్: రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (సమీకృత గురుకుల పాఠశాల)ను రెండేళ్లలో పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించామని చెప్పారు. సమీకృత పాఠశాలల నిర్మాణానికి సంబంధించి స్థలాల సేకరణ, పనుల పురోగతి, ఇతర అంశాలపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించి నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తామని తెలిపారు. నియోజకవర్గాల్లో స్థలాల కేటాయింపులు పూర్తయినకొద్దీ

(మిగతా 2వ పేజీలో)

## భారత్‌కు ఎఫ్35 యుద్ధ విమానాలు.



## ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు



- 2030 కల్లా 500 బిలియన్ డాలర్లకు.. ట్రంప్-మోదీ భేటీలో కీలక నిర్ణయాలు
- భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు.. భారీగా చమురు, సహజవాయువు
- వైట్‌హౌస్‌లో ట్రంప్ తో ప్రధాని భేటీ

## నేను బీజేపీకి అవసరం లేదనుకుంటా?: రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణ బీజేపీలో నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. బీజేపీ హైకమాండ్ నిర్ణయంపై ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీపై అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలోనే పార్టీలో వేధింపులు భరించలేకపోతున్నానని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో, బీజేపీలో అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారింది. తాజాగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ వీడియోలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజాసింగ్.. పార్టీలో వేధింపులు భరించలేకపోతున్నాను. దీని కంటే బయటికి వెళ్లడమే కరెక్ట్ అనుకుంటా. గోల్కొండ జిల్లా అధ్యక్ష పదవిని ఎస్సీ లేదా బీసీ వ్యక్తికి ఇవ్వాలని నేను సూచించాను. నేను చెప్పిన పేరు కాకుండా వేరే పేరు ఇవ్వడం ఏంటి?. కానీ, ఎంఐఎం పార్టీతో తిరిగే నాయకుడికి ఇచ్చారు. పార్టీకి నా అవసరం లేదనుకుంటా?. ముందు ముందు

(మిగతా 2వ పేజీలో)



# ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు

**2030 కల్లా 500 బిలియన్ డాలర్లకు**
**ట్రంప్-మోదీ భేటీలో కీలక నిర్ణయాలు**
**భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు**
**భారీగా చమురు, సహజవాయువు**
**వైట్‌హౌస్‌లో అధ్యక్షునితో ప్రధాని భేటీ**
**రెండోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారి మోదీని ఆత్మీయంగా ఆహ్వానించిన ట్రంప్**
**సుదీర్ఘ కరచాలనం, సుదృఢ ఆలింగనం**
**అనంతరం మీడియాతో సంయుక్త భేటీ**
**భారత్‌పైనా సమాన టారిఫ్‌లు తప్పవు**
**మోదీ సమక్షంలోనే ట్రంప్ స్పష్టీకరణ**



వాషింగ్టన్: ట్రంప్ 2.0తో మోదీ 3.0 తొలి భేటీ బంపర్ హిట్టయింది. భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెండింతలకు పెంచి 500 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయం జరిగింది. అందులో భాగంగా భారత్‌కు అమెరికా అత్యాధునిక ఎఫ్%-%35 యుద్ధ విమానాలను అందజేయడమే గాక రక్షణ ఉత్పత్తులను ఎగుమతులను ఇతోధికంగా పెంచనుంది. భారీగా చమురు, సహజవాయువు కూడా సరఫరా చేయనుంది. ఇరు దేశాలూ పౌర అణు సహకారాన్ని మరిం త ముందుకు తీసుకెళ్లనున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రం ప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ జరిపిన సమావేశం ఇలాంటి పలు కీలక ఒప్పందాలకు వేదికైంది. రెండు రోజుల అమెరికా పర్యటన లో భాగంగా అధ్యక్షునితో మోదీ శుక్రవారం (భారత కాలమానం ప్రకారం) వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో భేటీ అయ్యారు. మోదీ మూడోసారి ప్రధానిగా, ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించాక వారి మధ్య ఇదే తొలి సమావేశం కావడం విశేషం. మోదీని ట్రంప్ అత్యంత ఆత్మీయంగా స్వాగతించారు. చాలాసేపటిదాకా కరచాలనం చేయడమే గాక ప్రధానిని గట్టిగా హత్తుకున్నారు. 'మీరో అద్భుతమైన వ్యక్తి. గొప్ప మిత్రుడు. మిమ్మల్నెంతగానో మిస్సయ్యాం' అంటూ అత్యంత ఆప్యాయంగా పలకరించారు. అనంతరం భారత్, అమెరికా వాణిజ్య, దౌత్య సంబంధాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారంతో పాటు పలు అంశాలపై నేతలిద్దరూ సుదీర్ఘంగా చర్చించుకున్నారు. పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తర్వాత 44 నిమిషాల పాటు మీడియాతో సంయుక్తంగా మాట్లాడారు. అమెరికాకు మోదీ చిరకాల మిత్రుడంటూ మీడియా ముఖంగా కూడా ట్రంప్ పదేపదే ప్రశంసించారు.

### భారీ వర్తక ఒప్పందం: ట్రంప్

చైనాతో పాటు పలు దేశాలపై దూకుడైన టారిఫ్‌ల యుద్ధం ప్రకటించిన ట్రంప్, భారత్‌పై టారిఫ్‌ల విషయంలో మాత్రం కాస్త సున్నితంగానే స్పందించారు. కాకపోతే పరస్పర టారిఫ్‌ల విషయంలో మాత్రం అస్సలు మొహమాటపడబోమని మోదీ సమక్షంలో ట్రంప్ కుండబద్దలు కొట్టారు. అమెరికాపై భారత్ విధించే సుంకాలనే తామూ విధించి తీరతామన్నారు. పలు అమెరికా ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న దిగుమతి సుంకాలు చాలా హెచ్చుగా, ఏకపక్షంగా ఉన్నాయంటూ సంయుక్త మీడియా భేటీలోనే ఆక్షేపించారు. అయితే, అమెరికా నుంచి చమురు, సహజవాయువు దిగుమతుల పరిమాణాన్ని భారీగా పెంచేందుకు మోదీ సమ్మతించారని అధ్యక్షుడు వెల్లడించారు. ఆ రెండింట్లో భారత్‌కు తామే అతి పెద్ద సరఫరాదారులం కాబోతున్నట్టు చెప్పారు.

"భారత్‌తో వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు రక్షణ హార్డ్‌వేర్ తదితర ఉత్పత్తుల ఎగుమతులను ఈ ఏడాది నుంచి ఏటా బిలియన్ డాలర్ల మేరకు పెంచనున్నాం. అంతేగాక ప్రపంచంలోకెల్లా అత్యంత అధునాతనమైన ఎఫ్%-%35 స్టెల్త్ ఫైటర్లను భారత్‌కు అందజేస్తాం. భారత్‌తో అతి త్వర లో భారీ వర్తక ఒప్పందం కుదరనుంది. పౌర అణు ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. ఇందులో భా గంగా అమెరికా అణు పరిజ్ఞానాన్ని భారత్ తన మార్కెట్లలోకి అనుమతించనుంది" అని వెల్లడించారు. భారత్%-%పశ్చిమాసియా%-%యూరప్ ఆర్థిక కారిడార్ దిశగా కృషి చేయాలని అంగీకారానికి వచ్చామన్నారు. ఇండో%-%పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుకు ముకుతాడు వేసే దిశగా అధినేతల భేటీలో మరిన్ని నిర్ణయాలు జరిగాయి. వాటిలో భాగంగా భారత్‌కు మరో 6 అత్యాధునిక పీ%-%8ఐ దీర్ఘశ్రేణి సముద్ర నిఘా విమానాలను విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. జావెలిన్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్లు, స్ట్రైకర్ యుద్ధ వాహనాలను భారత్‌లో సంయుక్త తయారీ తదితరాలకూ సమ్మతించింది.

### పదేళ్లకు రోడ్‌మ్యాప్: మోదీ

భారత్, అమెరికా పరస్పర సహకారాత్మక బంధం మెరుగైన ప్రపంచానికి బాటలు పరుస్తుందని మోదీ ఆశాభావం వెలిబుచ్చారు. రక్షణ రంగంలో పరస్పర సహకారానికి వచ్చే పదేళ్ల కాలానికి రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటామని చెప్పారు. అంతరిక్ష రంగంలో సహకారాన్ని మరింత పెంపొందించుకుంటామని చెప్పారు. 2025ను అమెరికా%-%భారత్ పౌర అంతరిక్ష సహకార సంవత్సరంగా అభివర్ణించారు. "అన్ని విషయాల్లోనూ అమెరికా ప్రయోజనాలకే ట్రంప్ పెద్దపీట వేస్తారు. ఇది నేనెంతగానో అభినందించే విషయం. భారత ప్రయోజనాలకు నేను కూడా అంతే" అని వివరించారు. వ్యాపారవేత్త గౌతం అదానీ వివాదంపై ట్రంప్‌తో చర్చించారా అని ప్రశ్నించగా వ్యక్తులను గురించి అంశాలేవీ ప్రస్తావనకు రాలేదని చెప్పారు. చైనాతో లద్దాఖ్ వివాదాన్ని ప్రస్తావించగా సరిహద్దు ఘర్షణలు ఎవరికీ మంచివి కావని అభిప్రాయపడ్డారు. ట్రంప్ జోక్యం చేసుకుని చైనా, భారత్, రష్యా, అమెరికా కలసికట్టుగా సాగాలని అభిలషించారు. ట్రంప్‌తో భేటీ అద్భుతంగా సాగిందని అనంతరం మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. రెండు రోజుల అమెరికా పర్యటన ముగించుకుని శుక్రవారం ఆయన భారత్ బయల్దేరారు.

### ముంబై దోషుల్ని శిక్షించాల్సిందే

ఇస్లామిక్ రాడికల్ ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అమెరికా సంఘీభావం ప్రకటించింది. దాన్ని రూపుమాపేందుకు సంయుక్తంగా పోరాడతామని ట్రంప్ స్పష్టం చేశారు. 2008 ముంబై ఉగ్ర దాడుల దోషులందరికీ శిక్ష పడేలా చూడాల్సిందేనని పాకిస్తాన్‌కు స్పష్టం చేశారు. ఆ దాడుల్లో నిందితుడైన తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగిస్తున్నట్టు సంయుక్త విలేకరుల భేటీలో అధ్యక్షుడు ధ్రువీకరించారు. "ప్రపంచంలోకెల్లా అత్యంత హింసాత్మక వ్యక్తుల్లో ఒకరిని భారత్‌కు అప్పగిస్తున్నామని చెప్పేందుకు సంతోషిస్తున్నా. ముంబై ఉగ్ర దాడులకు పాల్పడ్డందుకు అక్కడ న్యాయ విచారణను ఎదుర్కొంటాడు. త్వరలో మరికొందరిని కూడా అప్పగిస్తాం" అని పేర్కొన్నారు. తద్వారా ఖలిస్తానీ వేర్పాటువాది పన్ను తదితరులకు పరోక్షంగా హెచ్చరిక సంకేతాలిచ్చారు. రాణా అప్పగింత పట్ల అమెరికాకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా తొలినుంచీ కలసికట్టుగా పని చేస్తున్నాయని గుర్తు చేశారు. ముంబై తరహా దాడులను నివారించేందుకు, అల్‌ఖైదా, ఐసిస్, జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా తదితర ఉగ్ర సంస్థల ఆట కట్టించేందుకు సంయుక్త కృషిని కొనసాగిస్తామని ఇరు దేశాల సంయుక్త ప్రకటన కూడా పేర్కొంది. పాక్ మూలాలున్న రాణా కెనడా జాతీయుడు. పాక్%-%అమెరికా ఉగ్రవాది డేవిడ్ కోల్మన్ హెడ్లీతో పాటు ముంబై దాడుల్లో ప్రధాన నిందితుడు. ప్రస్తుతం లాస్ ఏంజెలిస్ జైల్లో ఉన్నాడు.

### భారత్‌లో అమెరికా వర్సిటీల క్యాంపస్‌లు

పలు ప్రఖ్యాత అమెరికా విశ్వవిద్యాలయాలు త్వరలో భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. ట్రంప్‌తో ప్రధాని మోదీ చర్చల్లో ఈ మేరకు నిర్ణయం జరిగింది. ఉన్నత విద్యా రంగంలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవాలని కూడా నిశ్చయించారు. ఇందుకోసం పరస్పర సంయుక్త డిగ్రీలు తదితర పథకాలతో పాటు జాయింట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. అమెరికాలో చదువుతున్న 3 లక్షలకు పై చిలుకు భారత విద్యార్థుల వల్ల అక్కడి ఆర్థిక వ్యవస్థకు ఏటా 8 బిలియన్ డాలర్ల దాకా అందుతోందని నేతలిద్దరూ గుర్తు చేసుకున్నారు. అమెరికాలోని భారత సమాజానిది ఇరు దేశాల బంధంలో అతి కీలక పాత్ర అని మీడియా భేటీలో ట్రంప్ చెప్పారు. లాస్ ఏంజెలిస్, బోస్టన్ నగరాల్లో త్వరలో భారత కాన్సులేట్లు తెరవనున్నట్టు వెల్లడించారు.

### మానవ అక్రమ రవాణాపై పోరు: మోదీ

మనుషుల అక్రమ రవాణా భారత్‌కు మాత్రమే పరిమితమైన సమస్య కాదని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ప్రపంచ సమస్యగా అభివర్ణించారు. పెద్ద కలలు కనే సాధారణ కుటుంబాలకు చెందిన అమాయకులను పరాయి దేశాల్లో అక్రమ వలసదారులుగా మారుస్తున్న ఈ జాఢ్యంపై దీనిపై దేశాలన్నీ కలసికట్టుగా పోరాడాల్సి ఉందన్నారు. "పరాయి దేశంలో అక్రమంగా ప్రవేశించే వారెవరికీ

## భారత్‌కు ఎఫ్35 యుద్ధ విమానాలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం భారత దేశానికి అత్యాధునిక యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకు వచ్చారు. ప్రపంచం లోనే అగ్రశ్రేణి స్టెల్త్ ఫైటర్ జెట్లలో ఒకటైన లాక్‌హీడ్ మార్టిన్ ఎఫ్ 35 లైటెనింగ్ 2 వ రకం యుద్ధవిమానాలను భారత్‌కు అందించేందుకు సిద్ధమంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ సంవత్సరం నుంచి భారతదేశానికి మిలిటరీ ఉత్పత్తుల అమ్మకాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతామని,భారత దేశానికి ఎఫ్ 35 స్టెల్త్ ఫైటర్లను అందించడానికి మార్గం సుగమం చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని నరేంద్రమోడీతో సంయుక్త పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భారత్ అమెరికాల మధ్య వాణిజ్య, దౌత్య సంబందాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారం వంటి అంశాలు వీరి చర్చల్లో చోటు చేసుకున్నాయి. ఆ తరువాత వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. భారత దేశ ఇంధన భద్రతను నిర్ధారించడానికి, చమురు, గ్యాస్ వాణిజ్యంపై దృష్టి పెడతామని ప్రధాని మోడీ అన్నారు 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యమే మా లక్షం " అని మోడీ తెలిపారు. ఈమేరకు పరస్పర ప్రయోజన కరమైన వాణిజ్య ఒప్పందం అతి త్వరలో వస్తుందని ఆశిస్తున్నారు.



# రెండేళ్లలో సమీకృత గురుకులాలు

అనుమతులు జారీ చేస్తూ.. పనులు ప్రారంభించాలని, గడువులోగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### స్థలాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వండి

కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లలో స్కూళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, మార్చి 20న పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. దీంతో ఇతర గురుకులాల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు అనువుగా ఉన్నాయో, లేదో పరిశీలించాలని సీఎం సూచించారు. అనువైన స్థలాలు లేని ప్రాంతంలో ప్రత్యామ్నాయంగా స్థలాన్ని సేకరించాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాలకు రాకపోకలు అనువుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యతగా గుర్తించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వీలైనంత త్వరగా స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి, స్థలాల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి వారం రోజుల్లో జిల్లా కలెక్టర్లు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రెండేళ్లలో రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో సమీకృత గురుకులాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

### మహిళా వర్సిటీలో చారిత్రక కట్టడాల పరిరక్షణ..

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. మహిళా విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర అవసరాల కోసం చేపట్టే నిర్మాణాలు యూనివర్సిటీల స్థాయిలో ఉండాలని, ఈ విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గదులు, ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్, ఇతర నిర్మాణాలు చేపట్టాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలో ని చారిత్రక, పురాతన కట్టడాలను పరిరక్షించాలని, వాటికి అవసరమైన మరమ్మతుల విషయంలో పురావస్తు శాఖ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### 'పర్యాటక' బడ్జెట్ పెంచుతాం: సీఎం

పర్యాటక శాఖకు బడ్జెట్ పెంచుతామని, ఆ శాఖ ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు ఎన్నో ఉన్నా, ప్రచారంపై శ్రద్ధ చూపక, వినూత్న పద్ధతిలో ఆలోచించక ఆశించిన ప్రగతి లేదన్నారు. శుక్రవారం పర్యాటక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు వేదికలు రూపొందించాలని సూచించారు. ఆలయాలు, అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, వాటిని అభివృద్ధి చేయటంపై దృష్టి సారించాలని ఆదేశించారు. భువనగిరి కోట రోప్ వే పనులపైనా సీఎం ఆరా తీశారు. పర్యాటక పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీ ఐఐసీ, వైద్య, క్రీడల శాఖల మధ్య ఇబ్బందులు ఉండకుండా సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# మోదీ పుట్టుకతో బీసీ కాదు

భగవద్గీత అన్నాడు. ఆయన చేసిన లెక్క సక్కదనమైనది అయితే, ఎస్సీల్లో 59 ఉప కులాలుంటే ఆయన సర్వేలో 82 కులాలు ఎలా వచ్చాయి? రాష్ట్రంలో అందరినీ లెక్కపెడుతున్నప్పుడు కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు వివరాలు ఎందుకు ఇవ్వలేదు? అలా వివరాలు ఇవ్వని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు, మాట్లాడే హక్కు లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పోచంపల్లి వాళ్ల లెక్కలు చెప్పలేదు. కుల గణన చేయడం ఆ గ్యాంబ్లర్స్‌కు ఇష్టం లేదు. ఎందుకంటే వీళ్ల లెక్క తెలిస్తే గత ప్రభుత్వంలో నాలుగు మంత్రి పదవులు ఎలా తీసుకున్నారని బీసీలు అడుగుతారని, కడుగుతారని, వంగబెట్టి దంచుతారని తెలుసు. వీరి జనాభాకు వార్డు మెంబర్ కంటే ఎక్కువ పదవులేవీ రావు. అందుకే ఈ లెక్క రాకూడదని కేసీఆర్ కుట్ర చేస్తున్నాడు. మనకు తెలియకుండానే ఆ కుట్రలో మనం భాగస్వాములవుతున్నాం. నేను సవాల్ చేస్తున్నా.. మేం చేసిన కులగణనలో ఒక్క తప్పులేదు..'అని ముఖ్యమంత్రి అన్నారు.

### ఐదు గ్రూపుల్లో ముస్లింలు కూడా ఉన్నారు

'కొందరు కాంగ్రెస్‌కు నేనే ఆఖరు సీఎం అని అంటున్నారు. అయినా ఫర్వాలేదు. మా నాయకుడి మాట నిలబెట్టేందుకే ఈ కులగణన చేశాం. నాయకుడిచ్చిన మాటను నిలబెట్టడం మా ృధర్మమని, ఏ త్యాగానికైనా సిద్ధమయ్యే ముందుకెళ్లాం. అయినా దొంగ లెక్కలు ఇలా రాస్తారా? దొంగ లెక్కలు రాయాలనుకుంటే మా జనాభా 5 శాతం ఎందుకు చూపిస్తాం. 15%-%20 శాతం చూపిస్తాం కదా? కొందరు మైనార్టీల లెక్కలెలా తీస్తారని అంటున్నారు. గతంలో బీసీల్లో ఐదు గ్రూపులున్నాయి. అందులో ముస్లింలు కూడా ఉన్నారు. అందుకే వారి లెక్క తీశాం..'అని రేవంత్ వివరణ ఇచ్చారు.

### కోల్డ్ స్టోరేజీలో పెట్టేలా బీజేపీ కుట్ర

'బీసీల లెక్కలు రాకూడదన్నదే మోదీ, కేడీల ప్రయత్నం. తెలంగాణలో మా ప్రభుత్వం అన్ని కులాల లెక్కలు తీసిందని, అదే పని దేశవ్యాప్తంగా ఎందుకు చేయరని పార్లమెంటులో మోదీని రాహుల్‌గాంధీ నిలదీశారు. అందుకే రాష్ట్ర బీజేపీ నేతలు కూడా దీన్ని తప్పుల తడక అనే ముద్ర వేసి కోల్డ్ స్టోరేజీలో పెట్టాలనుకుంటున్నారు. నిజంగా మోదీకి బీసీలపై ప్రేమ ఉంటే 2021 లోనే జనాభా లెక్కలు తీసి అందులో కులగణన చేసేవారు. రేపు చేయబోయే జనగణనలో అయినా బీసీ కులాల లెక్క తేల్చాలి. నిజంగా మేం చేసిన లెక్కలు తప్పయితే మోదీ దేశ వ్యాప్తంగా కులగణన చేయడం ద్వారా రాష్ట్రంలోని బీసీల లెక్కలు తేల్చాలి. ఇవిగో మోదీ లెక్కలు, ఇవిగో రాహుల్ లెక్కలు అని ప్రజల ముందు పెట్టాలి..'అని సీఎం అన్నారు.

### వారి ఇళ్ల ముందు మేల్కొలుపు డప్పులు కొట్టండి

'ఎస్సీలను వర్గీకరించి రిజర్వేషన్లు పంపిణీ చేశాం. దీన్ని కూడా తప్పు పట్టాలని కొందరు చూస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు దీన్ని చాలెంజ్ చేయండి. ఏ లెక్క, ఏ వార్డు, ఏ కుటుంబంలో తప్పు ఉందో చెప్పమని అడగండి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్ల ముందు మేల్కొలుపు డప్పులు కొట్టండి. అప్పుడు కూడా వివరాలు ఇవ్వకపోతే సామాజిక బహిష్కరణ శిక్ష విధించండి..'అని సీఎం వ్యాఖ్యానించారు. సమావేశంలో కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మహా కుంభమేళాకు 50 కోట్లు దాటిన భక్తులు...

# ఆ ఒక్కరోజే 8 కోట్ల భక్తుల పుణ్యస్నానాలు

ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ఇప్పటి వరకు వచ్చిన భక్తుల సంఖ్య 50 కోట్లు దాటిందని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. భారత్, చైనా మినహా మిగిలిన ప్రపంచ దేశాల జనాభాను దాటేసినట్లు తెలిపింది. కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించిన వారి సంఖ్య అమెరికా, రష్యా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల జనాభా కంటే ఎక్కువ అని తెలిపింది. శుక్రవారం సాయంత్రానికి ప్రయాగ్‌రాజ్ వచ్చిన భక్తుల సంఖ్య 50 కోట్లు దాటిందని ప్రభుత్వం తెలిపింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక లేదా సామాజిక కార్యక్రమంలో కూడా ఈ స్థాయిలో జనం పాల్గొనలేదని తెలిపింది. ఈరోజు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు 92 లక్షల మంది భక్తులు తరలి వచ్చినట్లు తెలిపింది. జనవరి 29న మౌని అమావాస్య రోజు దాదాపు 8 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 144 ఏళ్లకు ఓసారి వచ్చే మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 26న ముగియనుంది. కుంభమేళాకు 45 కోట్ల మంది వరకు భక్తులు వస్తారని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. కానీ మరో పన్నెండు రోజులు ఉండగానే భక్తుల సంఖ్య 50 కోట్లను దాటింది. ఇదిలా ఉండగా, కుంభమేళా విషయమై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఉత్తర ప్రదేశ్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. అసత్య సమాచారం, తప్పుదోవ పట్టించే వీడియోలు వ్యాప్తి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు.

# నేను బీజేపీకి అవసరం లేదనుకుంటా?: రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



ఏమవుతుందో చూద్దాం. తెలంగాణలో బీజేపీ ఎప్పుడో అధికారంలోకి రావాల్సింది. కానీ, ఇలాంటి రిటైరైన వ్యక్తులు పార్టీలో ఉంటే బీజేపీ ఇక్కడ ఎప్పటికీ అధికారంలోకి రాదు. పార్టీ ఎమ్మెల్యే సూచించిన వ్యక్తికే జిల్లా అధ్యక్ష పదవి ఇస్తారు. తన సూచనను ఎందుకు పక్కన పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక, ఇదే సమయంలో.. ఈ విషయాన్ని పార్టీలోని ఓ కీలక నేతకు ఫోన్ చేసి అడిగితే తనకు తెలియదని సమాధానమిచ్చారు. దీనిని బట్టి చూస్తే పార్టీలో తనపై కుట్ర జరుగుతోందని అర్థం అవుతుందంటూ రాజాసింగ్ వివరించారు. తాను ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంతో యుద్ధం చేస్తూ వచ్చానని, కానీ, సొంత పార్టీలోనూ యుద్ధం చేయాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. 2014లో తాను పార్టీలో చేరానని, అప్పటి నుంచి వేధింపులు భరిస్తూనే ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి తాను అవసరం లేదని, వెళ్లిపోవాలని చెబితే ఇప్పటికిప్పుడు వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక
శనివారం, ఫిబ్రవరి 15, 2025



## ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన మధు యాష్కి, కార్పోరేటర్ సుజాత నాయక్

ఎల్బీనగర్,14 ఫిబ్రవరి:పిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ ఎల్బీనగర్ ఇంచార్జ్ మధుయాష్కి గౌడ్ నివాసంలో హస్తి నాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ ఆధ్వర్యంలో ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం మధు యాష్కి గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపన అధ్యక్షుడు శంకర్ నాయక్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్ నాయక్, స్టేట్ కన్వీనర్ రాధాబాయి, శుక్ర నాయక్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## న్యాయమూర్తి పై దాడి చేసిన నేరస్థున్ని కఠినంగా శిక్షించాలి సీనియర్ న్యాయవాది రామ్మోహన్ సాగర్

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయమూర్తి పై జరిగిన దాడి తీవ్రంగా ఖండిస్తూ ఈ క్రూరమైన దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీనియర్ న్యాయవాది రామ్మోహన్ సాగర్ అన్నారు అన్నారు.ఇటీవలి రోజుల్లో న్యాయాధికారులు మరియు న్యాయవాదులపై దాడులు పెరిగాయి, ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతకు మరియు న్యాయవ్యవస్థ భద్రతకు తీవ్రమైన ప్రమాదమని అన్నారు.నిందితుడి ని కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలను నివారించేందుకు కఠిన చట్టాలను అమలు చేయాలన కోరారు. హయత్ నగర్ కోర్టుల లో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్త చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇంద్రసేనారెడ్డి, గోపి శంకర్ యాదవ్, మేకల సంతోష్, భార్గవి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు



## మందకృష్ణ కి తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం జనసంఘం సమస్యల పరిష్కారం కోసం వినతి

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఈ నెల 13 వ తేదీ గురువారం రోజున మందకృష్ణ మాదిగ తో తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగం జన సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయనను శాలువ తో సత్కారం చేసారు. అనంతరం ఆయన తో జరిగిన భేటీ లో మంద కృష్ణ కి వివరిస్తూ గత 4వ తేదీన కుల వర్గీకరణ విషయంలో మా బేడ బుడగ జంగం కులాన్ని ఏ గ్రూపులో చేర్చినందుకు సంతోషిస్తున్నాం. కానీ 1% శాతం ఇచ్చినందున బాధాకరం కాని మాకు 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సవివరంగా వివరించడం జరిగింది. 2011 జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేస్తేమా కు నష్టం జరుగుతుందని 2024 కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన ద్వారా వర్గీకరణ చేపట్టితే సంచార జాతుల కి మేలు కలుగుతుంది అని సి. ఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. కొన్ని కులాలను సంచరజాతులుగా గుర్తించినారు. కానీ విద్య పరంగా ఉద్యోగపరంగా ముందున్న మన్నె, పంబాల ,కులాన్ని ఇందులో చేర్చినారు. వీరిని గ్రూపు ఒకటిలో నుండి తీసివేయాలని వారినీ గ్రూపు(3)లో చేర్చి మాకు న్యాయం చేయాలని,స%శీ%చార జాతులైన కులాలను ఏ గ్రూపులో చేర్చగలరని మనవిమాకు 3% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడమైనది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు, ప్రచార కార్యదర్శి వానరాశి గిర్ని వెంకటి, జనరల్ సెక్రటరీ పత్తి భాష శివ, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు పస్తం దేవుడు కుమార్, కప్పెర జంగయ్య, పత్తి మహేష్, పత్తి రవి, రేవల్లే రాంబాబు, కడమంచి భాస్కర్,కొండపల్లి సమ్మయ్య, లు పాల్గొనడం జరిగినది.



## సగర శంఖారావానికి గ్రామ గ్రామాన సగరులు సైన్యమై కదలాలి

### తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షు ఉప్పరి శేఖర్ సగర

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

నాగర్ కర్నూల్ లో జరిగే సగర శంఖారావానికి గ్రామ గ్రామాన సగరులు సైన్యమై కదలని పిలుపునిచ్చారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర. సగర జాతికి చరిత్రలో నిలిచిపోయే సభ కావాలి అన్నారు. ఈ శంఖారావం మహాసభ ద్వారా ప్రభుత్వానికి మన కులబలం తెలివాలని అన్నారు. మన హక్కులను మన సగరులకు గౌరవం దక్కాలంటే ఈ మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జడ్. పి గ్రౌండ్ నాగర్ కర్నూల్ చేరుకోవాలని. చరిత్రత్మకంగా జరిగే మహాసభను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్క సగరులు కుటుంబ సమేతంగా కదలి రావాలని పిలుపునిచ్చారు

# డి.ఈ.వో కు శ్రీ ప్రయాగ రాజ్ మహా కుంభమేళ పవిత్ర జలం అందజేత

### ఆర్.యు.పి.పి.టి రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 14

జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము కు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ శ్రీ ప్రయాగ రాజ్ నుంచి తీసుకవచ్చిన మహా కుంభమేళ పవిత్ర పుణ్య జలాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె రాము నాయక్ కు అందజేశారు. ప్రయాగ్ రాజ్ తీర్థ క్షేత్రం లో 144 సంవత్సరాల కు ఒక సారి వచ్చే మహా కుంభమేళ పుణ్య జలం అత్యంత శక్తివంతమైనవని, పవిత్ర మైనవని సనాతన ధర్మ శాస్త్రాలు తెలియజేస్తున్నాయని, మన రుషులు, మునులు, పెద్దలు తెలియజేశారని, నదులు, పర్వతాలు, ప్రకృతి సనాతన ధర్మానికి, సాంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నాలని, ఆరాధన క్షేత్రాలని, ఈ పవిత్ర జలాన్ని సంప్రోక్షణ చేసుకోవడం ద్వారా ఇక్కడి నీటిలో కలుపుకొని స్నానం చేయడం ద్వారా మహా కుంభమేళ లో స్నానం చేసిన పుణ్య ఫలం లభిస్తుందని మన పెద్దలు తెలియజేస్తున్నారని, స్వీయ ఆరాధన సర్వ ఆదరణ, లోకా సమస్తా సుఖినోభవంతు, మాధవ సేవగా సర్వ ప్రాణి సేవ అని సనాతన ధర్మం తెలియజేస్తుంలని వేల్పుల స్వామి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన




కార్యదర్శి చంద సత్యనారాయణ, టి.జి.యు.ఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు నూనావత్ రాజు, హీందూ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు డి. జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే బడ్జెట్లో బస్వాపురం ప్రాజెక్టుకు రూ. 500 కోట్లు కేటాయించి వెంటనే పూర్తి చేయాలి

### నిర్వాసితులకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్

భువనగిరి, ఫిబ్రవరి 14(వార్త మిర్రర్):రాష్ట్ర ప్రభుత్వము రాబోయే బడ్జెట్లో బస్వాపురం రిజర్వాయర్ కు రూ. 500 కోట్ల కేటాయించి వెంటనే పూర్తి చేయాలని, ముంపునకు గురైన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో సిపిఎం భువనగిరి మండల కార్యదర్శివర్గ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ అధ్యక్షతన జరగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, త్రాగు నీటికి కీలకంగా ఉపయోగపడే బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణ కాంట్రాక్టర్ కు డబ్బులు చెల్లించకపోవడంతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కావడం లేదని రిజర్వాయర్ కు సంబంధించిన పెండింగ్ నిధులను ఈ బడ్జెట్లో నన్న కేటాయింపులు చేసి నిధులను విడుదల చేస్తే రైతాంగానికి ఉపయోగపడుతుందని, వందలాది ఎకరాలు సాగులోకి రావడం వల్ల ప్రజలలో కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుందని, నిరుద్యోగ సమస్య కూడా కొంత పరిష్కారం అవుతుందని అన్నారు. రిజర్వాయర్లో ముంపునకు గురవుతున్న బి.ఎన్ తిమ్మాపురం, లప్పానాయక్ తండ, చొక్లా తండ ముంపు బాధితులకు కూడా న్యాయం




జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వము ఎన్నికల ముందు ప్రకటించిన అన్ని సంక్షేమ పథకాల అమలుకు రాబోవు బడ్జెట్లో తగిన నిధులు కేటాయించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పది లక్షల రూపాయలు కేటాయించాలని, కార్పొరేషన్లకు కూడా నిధులు కేటాయించి వాటి ద్వారా దళిత, గిరిజన, వెనకబడ్డ తరగతులు, మైనార్టీల సంక్షేమానికి పాటుపడాలని నర్సింహ ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య , మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, కొండ అశోక్ , కొండమడుగు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మరో విద్యుత్ అధికారి... ఏసీబీకి పట్టుబడ్డ గచ్చిబౌలి ఏడిఈ సతీష్ కుమార్



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :శేరిలింగంపల్లి గచ్చిబౌలి విద్యుత్ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించారు. 75 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన ఏ డి ఈ సతీష్ కుమార్. ట్రాన్స్ ఫార్మర్ మంజూరు కోసం ఏడిఈ సతీష్ కుమార్ 75 వేల రూపాయలు డిమాండ్ చేయగా వినియోగదారుల నుండి ముందే 25 వేల రూపాయలు తీసుకున్నారు. శుక్రవారం రోజు మరో 50 వేల రూపాయలు తీసుకుంటున్న ఏడిఈ సతీష్ కుమార్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.



## సేవాలాల్ జయంతికి ప్రతి గ్రామం, తండాల నుండి గిరిజనులు భారీ సంఖ్యలో తరలిరావాలి

– కడ్తాల్ మాజీ జడ్పీటిసి.. దశరథ్ నాయక్

కల్వకుర్తి కడ్తాల్ ఫిబ్రవరి 14 వార్త మిర్రర్ ప్రతినిధి:– బంజారాల ఆరాధ్య దైవం సద్గురు శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతికి రేపు ఫిబ్రవరి 15 శనివారం రోజున ఉదయం 10 గంటలకు కడ్తాల్ మండల కేంద్రంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. కాబట్టి కడ్తాల్ మండలంలోని ప్రతి గ్రామాల, తండాల నుండి గిరిజనులు పార్టీలకు అతీతంగా భారీ ఎత్తున కడ్తాల్ మండల కేంద్రానికి తరలివచ్చి సేవాలాల్ జయంతిలో పాలుపంచుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. రేపు ఉదయాన్నే ఎనిమిది గంటలకు ప్రతి గ్రామంలో తండాలలో భోగ్ బండారు కార్యక్రమం నిర్వహించుకొని 10 గంటల లోపల మండల కేంద్రానికి తరలిరావాలని కోరారు.





## శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సావాలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 14 శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 286వ జయంతి సందర్భంగా ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో రాజనగర్ తండా మరియు లీల్యా నాయక్ తండాలలో జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ధర్మజాగరణ ప్రముఖులు సురేందర్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ గొప్పదనం గురించి వివరించారు. సేవాలాల్ హిందూ ధర్మం గొప్పతనం గురించి బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడని, హింస పాపమని, మత్తు, ధూమపానం శాపం అని హితవు పలికి బంజారా జాతికే కాదు యావత్ ఇతర కులాలకు ఆదర్శంగా నిలిచారు. సేవాలాల్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వాటిలో ఫెరీ ఫర్ ఒకటి అని అన్నారు. గిరిజనుల ఉన్నతి కోసం ధర్మ ప్రచారం ఆర్థిక సంస్కరణలు మతమార్పిడులను అరికట్టడం క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలవునవి చేశారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మజాగరణ కార్యకర్తలు గుగులోవత్ జలపతి, నగవత్ శ్రీను, తిరుమల్, జ్యోత్స్న, మరియు తండా మహిళలు పాల్గొన్నారు..



## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రమాణ స్వీకారం లో పాల్గొన్న మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బచ్చనగోని కిరణ్ యాదవ్

సంస్థాన్ నారాయణపూర్, ఫిబ్రవరి 14(వార్త మిర్రర్):తెలంగాణ యూత్ కాంగ్రెస్ నూతన రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గాంధీ భవన్లో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమాలో నల్లగొండ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ నాయకులు మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బచ్చనగోని కిరణ్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతినిత్యం ప్రజల కోసం పోరాడుతూ యువత ముందుండలన్నారు,ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోర్పునూరు శ్రీకాంత్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి జాల మణికంఠ,దిలీప్,సైదులు,మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ యాదవ్,మందుల సైదులు,యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు పొందిన మహిళలు.

### - టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సమక్షంలో నియామక ప్రత్రాలు అందజేత





కల్వకుర్తి ఫిబ్రవరి 14 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనకై ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ వారుటాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు త్వరలో నియోజక వర్గ వ్యాప్తంగా జాబ్ రిక్రూట్మెంట్ డ్రైవ్స్ దాదాపు 3000 మంది వరకు నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పనను కృషి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ వారు నిర్వహిస్తున్న జాబ్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా ఇటీవల ఇంటర్వ్యూ ప్రక్రియలో అర్హతసాధించిన వెల్దండ మండలం చౌదర్పల్లి మరియు గొల్లోనిపల్లి గ్రామాలకు చెందిన 31 మంది మహిళలు నియామక పత్రాలు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగాటాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూఉద్యోగ అవకాశాలు అందించడానికి ముందుకు వచ్చిన కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూనియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యంగా మహిళల కోసం ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా జాబ్స్ రిక్రూట్మెంట్ డ్రైవ్స్ నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం అని నియోజవర్గ వ్యాప్తంగా దాదాపుగా 3000 మంది వరకు మహిళలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలోటాస్క్ టీం సభ్యులతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## సగర శంఖారావం మహాసభను విజయవంతం చేద్దాం.. నేర్లకంటి రవి సాగర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సగర శంఖారావం మహాసభను విజయవంతం చేయాలని. నల్లగొండ జిల్లా సగర సంగం అధ్యక్షులు నేర్లకంటి రవి సాగర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సగర సంఘం మరియు నాగర్ కర్నూల్ జిల్లా సగర సంగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తారీకు ఆదివారం రోజున నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జెడ్. పి గ్రౌండ్లో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించు సగర శంఖారావానికి నల్లగొండ జిల్లా నుండి సగరులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు

# ప్రతి మగ్గానికి ముగ్గురికి పొదుపు పథకం వర్తింప చేయాలి

## చేనేత కార్మికుడికి రుణమాఫీ తక్షణమే అమలు చేయాలి

## తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్

నల్గొండ జిల్లా వార్తా మిర్రర్ ప్రతినిధి...(ఏలే భాస్కర్).. మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడి తో పాటు అనుబంధ వృత్తి కార్మికులు మరో ఇద్దరికి చేనేత పొదుపు పథకం అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ దొడ్డి కొమరయ్య భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో చేనేత మగ్గానికి అనుబంధంగా అచ్చు అతికేవారు, చిటికీ కట్టేవారు, పడుగు పోసేవారు, రంగులు అద్దేవారు, కండేలు పట్టే కార్మికులు జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పొదుపు పథకంలో గతంలో చేనేత కార్మికులతో పాటు మరో ఇద్దరు అనుబంధ కార్మికులకు పొదుపు పథకం వర్తింపజేసి ప్రతి కార్మికుడు ఎనిమిది వందలు పొదుపు చేసుకుంటే 1600 ప్రభుత్వం వారు ఖాతాలో జమ చేసే వారు అని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పొదుపు పథకంలో అనుబంధ కార్మికుల పొదుపు 200 తగ్గిస్తూ 600 పొదుపు చేసుకుంటే 1200 ఖాతాలో జమ చేస్తామని చెప్పడం సరికాదని అన్నారు. చేసుకునే పొదుపును తగ్గించకుండా గతంలో మాదిరిగా పొదుపు పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మరియు సహకార సంఘాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ వెంటనే అమలు చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. హౌస్ కం వర్క్ షెడ్ పథకం కింద చేనేత కార్మికులకు 120 గజాల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు



ఇవ్వాలని కోరారు. గతంలో హామీ ఇచ్చిన ప్రకారం నూలు సబ్సిడీ 50 శాతం ఇచ్చి నగదు బదిలీ పథకం ద్వారా కార్మికుడి ఖాతాలో జమ చేయాలని కోరారు. చేనేత అనుబంధ కార్మికుల పొదుపు పథకం, రుణమాఫీ, ఇంటి నిర్మాణం, నూలు సబ్సిడీ ల విషయంలో చేనేత జౌళి శాఖ మంత్రి మరియు కమిషనర్ జోక్యం చేసుకొని పరిష్కారం చేయాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, ఉపాధ్యక్షులు కర్నాటి శ్రీరంగం, రాపోలు వెంకన్న, గడ్డం దశరథ, కర్నాటి వెంకటేశం, గోషిక నరసయ్య పాల్గొన్నారు





## విద్యార్థులకు న్యూ స్టార్ యూత్ మెటీరియల్ పంపిణి.

సంస్థాన్ నారాయణపుర్, ఫిబ్రవరి 14(వార్త మిర్రర్)

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2002- 03, 10వ తరగతి పూర్వ విద్యార్థులు న్యూ స్టార్ యూత్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు దంటిక కుమార్ సహకారంతో విద్యార్థులకు న్యూ స్టార్ యూత్ సభ్యులు మెటీరియల్స్ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదగాలని అన్నారు,ప్రతి విద్యార్థి పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత పొందాలని సూచించారు,విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని కోరారు,చదువుకునే స్థాయిలోనే విజయం సాధించాలి తిరిగిపోయిన జీవితంలో అపజయాన్ని చూడవలసి వస్తుందని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు,అనంతరం విద్యార్థులకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ చదువుల కోసం అన్ని విధాలుగా సహకరిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయులు రమాదేవి కి న్యూ స్టార్ యూత్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో న్యూ స్టార్ యూత్ అధ్యక్షులు బొమ్మని రఘు, యూత్ సభ్యులు సికిలమెట్ల ప్రభాకర్, ఎండి అన్సారుద్దీన్, అందే నరేష్ యాదవ్, ఏలే సతీష్, బండి శీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కిష్టంపేట లో పుల్వామా అమర వీరులకు ఘన నివాళులు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 14 ఫిబ్రవరి14 2019 లో పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్ లకు కిష్టంపేట గ్రామంలో యువత ఘనంగా నివాళు లర్పించారు. ఇట్టి కార్యక్రమంలో డా. బి ఆర్ అంబెడ్కర్ నేషనల్ అవార్డ్ గ్రహీత జాన గోపి మాట్లాడుతూ మన దేశంలో ప్రజలు కడుపు నిండా భోజనం చేయడానికి రైతులు ఏవిదంగా తోడ్పడుతున్నారో అదేవిధంగా దేశం లోని ప్రజలు హాయిగా నిద్ర పోతున్నారు అంటే మన దేశ జవాన్ ల ప్రాణ త్యాగం వల్లనే ఈ రోజు మనందరం సుఖఃసంతోషాలతో జీవిస్తున్నాం.వారిని ఆదర్శంగా తీసుకుని మన యువత ఆర్మీలో చేరి దేశ భద్రత లో పాలు పంచుకోవాలని కొరినారు.ఇట్టి కార్యక్రమంలో సిరపురపు సత్తయ్య, కొమురిల్లి శరత్, అడెపు హరికృష్ణ, చాంద్ పాషా, జోగిని పెల్లి తిరుపతి గౌడ్, మారుపాక రమేష్, ఆకుల శ్రీను, వేములవాడ మహేష్, సతీష్, మహేష్, వెంకన్న, గంగాధర్, నర్సయ్య, అఫ్రిద్, నాగరాజు, మల్లయ్య, శివ,తిరుపతి,రాజేష్, వినోద్, అరుణ్, లక్ష్మినారాయణ, నాగన్న, మధు,పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సగర శంఖారావం మహాసభను విజయవంతం చేద్దాం.

### భగీరథ ఆత్మ గౌరవ భవన ట్రస్ట్ మెంబర్ రసాల వెంకటేష్ సాగర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్




నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సగర శంఖారావం మహాసభను విజయవంతం చేయాలని. భగీరథ ఆత్మ గౌరవ భవన ట్రస్ట్ మెంబర్ రసాల వెంకటేష్ సాగర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 వ తేదీ ఆదివారం రోజున నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సగర శంఖారావం మహాసభను యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి సగరులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు




## వరి పొట్ట దశలో యూరియాను సూచనల మేరకు వాడుకోవాలి,

మిర్యాలగూడ ,ఫిబ్రవరి 14:- (వార్త మిర్రర్)మిర్యాలగూడ మండలంలోని ఎన్డీసీఎంఎస్, శ్రీనివాస్ నగర్ లోని ఎన్డిసిఎంఎస్, కేకే ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి. శ్రవణ్ కుమార్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఎన్డిసిఎంఎస్ లలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, సోమవారం, మంగళవారాలలో 2 రాక్స్ ఇంకా ఈ నెలలో మరో పదివేల మెట్రిక్ టన్ను యూరియా రానున్నదని చెప్పారు. సిఫారసు మేరకు యూరియా వాడుకోవాలని సూచించారు. అధిక యూరియా వాడినట్లయితే పంట పొలాలలో చీడపీడలు అధికమై అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగులు అధికంగా వచ్చి పంట పొలాలు దిగుబడి తగ్గే అవకాశం ఉందని సూచించారు. రైతులు సిఫారసు మేరకు ఎరువులు వాడుకోవాలని పురుగుమందుల విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మిర్యాలగూడ దీరావత్ సైదా నాయక్, రైతులు శేఖర్ రెడ్డి, హరిబాబు, శ్రీనివాస్రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మిర్యాలగూడ ఫిబ్రవరి 14:-( వార్త మిర్రర్) రంగారెడ్డి కోర్టులో ముద్దాయి జడ్జిపై చెప్పు విసిరిన కేసులో నిరసనగా తెలంగాణ అడ్వకేట్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం మిర్యాలగూడ న్యాయవాదులు నిరసన తెలిపి పట్టణంలోని 5 కోర్టుల విధులు బహిష్కరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండి.ఇబ్రహీం, కార్యదర్శి ఎస్.వేలాద్రి, పవన్ కుమార్, లింగంపల్లి శ్రీనివాస్, వేణుగోపాల్, పరమేష్, కె.శ్రీనివాస్రెడ్డి, పెంటారెడ్డి, రాజ్ కుమార్, మస్తాన్, మంద సైదులు, ఆర్.భాస్కర్, బి.మోహన్, ఎల్లయ్య, అశోక్, మల్లేష్ యాదవ్, విడి ప్రసాద్, పుల్లారెడ్డి, పి.శ్రీరాములు, కొంక వెంకన్న న్యాయ వాదులు పాల్గొన్నారు



## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఏడ్మ సత్యం.

కల్వకుర్తి అమనగల్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మున్సిపాలిటీ లో సంద మల్లయ్య సాగర్ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఏడ్మ సత్యం తన నివాసానికి వెళ్లి పూలమాలవేసి నివాళులు అర్పించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ మృతుడి కుటుంబానికి భవిష్యత్తులో అన్ని రకాలుగా అండగా ఉంటానని మరోసారి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేనావత్,పత్య నాయక్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి,మాజీ సర్పంచ్ జంగయ్య,మున్సిపాలిటీ యూత్ వింగ్ అధ్యక్షులు వడ్డే, వెంకటేష్, వరికుప్పల గణేష్ శ్రీధర్ యాదవ్, పడకంటి శివ, సాగర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## మా అమెరికా పర్యటన పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్, ఎమ్మెల్సీ కోదండరాం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 14 ... తార్నాక లోని ఎమ్మెల్సీ కోదండరామ్ ఆఫీసులో డాక్టర్ లక్కరాజ నిర్మల రచించిన మా అమెరికా పర్యటన అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, విశ్రాంతి ప్రొఫెసర్ బాగయ్య, సతీష్ శర్మ, కొండపల్లి నరసింహారావు, రేణుకాపతి, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. పుస్తకం రాయడం దాన్ని ప్రచురించడం చాలా కష్టతరమైన ఈ రోజుల్లో మంచి పుస్తకాన్ని తీసుకుని వచ్చి అందరికి అందుబాటులో వ్యక్తిత్వ వికాసపు విషయాలను నలుగురికి చేరాలని డాక్టర్లకు రాజు నిర్మల చేసిన రచన అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం భాగయ్య మాట్లాడుతూ రచన చాలా సుల సులభతరంగా ఉందని అందరికీ అర్థమయ్యేలా ఉందని లక్కరాజు నిర్మల తన అనుభవాన్ని జోడించి అందరికీ మోటివేషన్ ఇచ్చినట్టుగా రచన ఉందని కొనియాడారు. లక్కరాజు నిర్మల విశ్వ నియమాల మీద రీసెర్చ్ చేయడం ద్వారా విశ్వ నియమాలను ప్రపంచవ్యాప్తం చేయాలన్న కోరికతో మొట్టమొదటి పుస్తకాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఉస్మానియా యూనివర్సిటీలోనే కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ....ఆత్మీయ సాంస్కృతిక సంస్థ తార్నాక, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్క నిర్మల,విశ్రాంత ప్రొఫెసర్ భాగయ్య, కొండపల్లి నరసింహ రావు, పండితులు సతీష్, రేణుకాపతి, రాజ్యం, ఓమ్ ప్రకాష్ పాల్గొన్నారు.



## పిల్లలే ఉపాధ్యాయు లైన వేళ

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల పిల్లలే ఉపాధ్యాయులు గా మారి పాఠ్యాంశాలు బోధించారు. పాఠశాల ప్రార్ధన నుండి ప్రధానోఫాధ్యాయులు గా ఫైజల్, మండల విద్యాధికారి గా అలేఖ్య, జిల్లా విద్యాధికారిగా సుదీప్ పరియార్, వ్యవహరించగా 44 మంది టీచర్స్ గా పనిచేశారు. ఉత్తమ ఉపాధ్యా యులు గా విశ్వ, సింధు, నిఖిత, గౌతం కృష్ణ, అమృత సాయి బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన రావు,ఎస్. బాలమణి, సుధారాణి, లీలాదేవి, బాలామణి, అర్. కే. లక్ష్మి దేవి, రాజగోపాల్ రెడ్డి, ప్రసాద్, మాధవి, ప్రేమ్ కుమార్, సారిక, నవ్య పాల్గొనగా ఎస్ ఆర్ జీ మధు సూదన్ రెడ్డి,, సిద్ధిక్ నగర్ ప్రధానోపాధ్యాయులు రవి కేతావత్ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎం.ఎల్.ఏ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 14

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట కి చెందిన నల్లాల గంగారం అనారోగ్యం తో బాధపడుతూ ఉండగా వారిని వారి స్వగృహం కిష్టంపేట లో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్.వారి వెంట నాయకులు మాజీ ఏ.ఎం.సి డైరెక్టర్ తిరుపతి గౌడ్, ఆడేపు హరికృష్ణ, సిరిపురం సత్తయ్య, ఆకుల శ్రీనివాస్, ముల్క వెంకటేష్,తిరుమల శంకరయ్య తదితరులు ఉన్నారు.



## మిర్యాలగూడ మున్సిపాలిటీ నక్షకు డ్రోన్ సర్వేకు సన్నాహాలు

మిర్యాలగూడ ఫిబ్రవరి 14:- మిర్యాలగూడ మున్సిపాలిటీలో శుక్రవారం డ్రోన్ సర్వే నిర్వహించేందుకు ల్యాండ్ సర్వే అధికారులు హెలికాప్టర్ సర్వే చేపట్టారు. సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ కోసం పైలట్ ప్రాజెక్టుగా డ్రోన్ సర్వే ఫిబ్రవరి 5న మిర్యాలగూడలో ప్రారంభించారు. డ్రోన్ సర్వే నిర్వహించేందుకు ముందుగా డిఫరెంషియల్ గ్లోబల్ పోసిషనల్ సిస్టమ్ (సెటిలైట్ అనుబంధం)లో ప్రాథమిక సర్వేను ప్రారంభించారు రాష్ట్రంలో 10 మున్సిపాలిటీల సర్వే పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపికయ్యాయని అందులో భాగంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలో 14 బృందాలు ఆర్వీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ప్రాథమిక సర్వే పూర్తయిన తర్వాత గచ్చిబౌలిలో శిక్షణ పొందిన డ్రోన్ సర్వేయర్లకు తుది సర్వే కోసం నివేదించడంతో నక్ష సర్వేను శుక్రవారం ప్రారంభించారు. నాగార్జునసాగర్ నుండి హెలికాప్టర్ తొలుత ఎరియల్ చేపట్టేందుకు సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఫరీదా, నల్లగొండ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితర అధికారులతో కలిసి నాగార్జునసాగర్ హెలిపాడ్ నుండి మిర్యాలగూడ ఎరియల్ పరిశీలన చేశారు. డ్రోన్ సర్వే అనంతరం టీ సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. తొలుత మిర్యాలగూడ పట్టణంలో రోవర్లు ఏర్పాటు చేసే స్పాట్లను గుర్తించి రంగులు వేశారు. శనివారం నుండి పూర్తి స్థాయిలో నక్ష సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, టిపిఓ సోమయ్య, టీపిఎస్ అంజయ్య, ఆర్వీ అసోసియేట్స్ ప్రతినిధి ప్రవీణ్, సర్వేయర్ ఖాద్రీ ఉన్నారు.



## కుంభమేళ రోడ్డు ప్రమాద బాధితుల కు అండగా కేంద్రం.. ఎంపీ ఈటెల

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 14 ....తార్నాక నాచారం నుండి కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న హైదరాబాద్ వాసులు ఏడుగురు మధ్యప్రదేశ్ యాక్సిడెంట్ లో మృతి చెందిన ఘటనలో బాధితులను తార్నాక లోఎంపీ ఈటెల రాజేందర్ పరామర్శించారు. తార్నాక ఉమా సిగ్నేచర్ అపార్ట్మెంట్స్ కు చేరుకున్న ఎంపీ ఈటలతో పాటు బిజెపి జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న, స్టేట్ కౌన్సిల్ మెంబర్, బిజెపి సీనియర్ లీడర్ పోచయ్య యాదవ్, బీజేపీ స్టేట్ రజక సెల్ నాయకులు కొన్నే సంపత్, తార్నాక డివిజన్ ప్రెసిడెంట్ ఉపేందర్ యాదవ్, నాయకులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



## ములకంపల్లి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కు ప్రత్యేక ఆహ్వానం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు. డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కు ములకలపల్లి శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహొూత్సవానికి హాజరుకావాలని. ప్రత్యేక ఆహ్వానం పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహొూత్సవం కనుల పండుగగా జరపాలని. సంస్కృతి. సాంప్రదాయాల ప్రకారం వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని కో రారు.ఈ కార్యక్రమంలో ములకలపల్లి గ్రామ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## ఆర్టీసికి ఎన్నికల కోడ్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఎలక్షన్ కమిషనర్ కు జెఏసి విజ్ఞప్తి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 14.... టిజిఎస్ ఆర్టీసి జెఏసి ఆధ్వర్యంలో ఎలక్షన్ కమిషనర్ ను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నుండి ఆర్టీసికి మినహాయింపు ఇవ్వాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని జెఏసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10 న జాయింట్ లేబర్ కమిషనర్ జెఏసి నాయకులను సమావేశానికి రమ్మని పిలిచి ఎన్నికల కోడ్ సాకుతో సమావేశాన్ని వాయిదా వేయడం వలన ఎలక్షన్ కమిషనర్ ను స్వయంగా కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఇందులో ఆర్టీసి కార్మిక సంఘాలు జనవరి 27న సమ్మె నోటీసు ఇచ్చాయని, ఎన్నికల కోడ్ ఫిబ్రవరి 3న వచ్చిందని, 7వ తేదీన లేబర్ కమిషనర్ గారు చర్చలకు రమ్మని లెటర్ ఇవ్వడం జరిగిందని, తర్వాత అకారణంగా ఎన్నికల కోడ్ సాకుతో చర్చలను వాయిదా వేసి మరొక తేదీని త్వరలో తెలియజేస్తామని చెప్పినారు. కావున ఎలక్షన్ కమిషనర్ ను ఆర్టీసి కార్మికుల డిమాండ్స్ ఈ ఎన్నికల పరిధిలోనివి కావని, వాటి గురించి వివరించగా వారు సానుకూలంగా స్పందించి జెఏసి ఇచ్చిన వినతిపత్రంలో పొందుపరచిన అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెఏసి కోశాధికారి బి.యాదయ్య, ఎన్.కమలాకర్ గౌడ్, కె. ఎస్. పాల్, ఎం.ఎ.మజీద్, జి.రాములు పాల్గొన్నారు.



## మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు

ఆమంగల్ ప్రతినిధి వార్త మిర్రర్ :

మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఇంటికి వచ్చిన తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. హైదరాబాదులో పలు కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత కర్మన్గట్టులోని ఉప్పల వెంకటేష్ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్ ఇంటికి వచ్చి కాసేపు ముచ్చటించడం జరిగింది. కల్వకుర్తి నియోజకవర్గం లోని పరిస్థితుల గురించి తెలుసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# 72 సంవత్సరాలుగా పురోహితుడిగా మూడు తరాలకు పెళ్లిళ్లు చేసిన పగిడిమర్రి దక్షిణామూర్తి పంతులు



**11సంవత్సరాల వయసులో మొదలుపెట్టిన పురోహితం నేటి 83 వ సంవత్సరంలో కూడా శుభకార్యాలు చేయడంలో దిట్ట..!**

**పెండ్లికి పంతులు కట్నంగా 1 రూపాయి పావలా తో మొదలు**

**యాదాద్రి వార్త మిర్రర్**
**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (గణేష్ సాగర్)**

**1) పంతులుగారు మీరు పురోహిత్యం ఏ వయసులో ప్రారంభించారు ఇప్పటికీ ఎన్ని పెండ్లిలు చేసుంటారు**

నేను 11 సంవత్సరాల వయసు లో పురోహితుడిగా పెండ్లిలు, శుభకార్యాలు గృహప్రవేశాలు చేయడం మొదలుపెట్టాను ఎన్ని పెళ్లిళ్లు చేశానో నాకు గుర్తుకులేదు మీరు అనుకునే కంటే ఎక్కువనే వేలల్లో పెళ్లిళ్లు చేసి ఉంటా.

**2) మన గ్రామంలో ఎ కుటుంబంలోనైనా మూడు తరాలవారికి పెళ్లిళ్లు చేశారా మొదటి పెళ్లిలో మీరు తీసుకున్న కట్నం ఎంత.! ఇప్పుడు ఎంత తీసుకుంటున్నారు.!**

ఒకే కుటుంబంలో మూడు తరాలకు పెండ్లిలు చాలా చేశాను, నాకు మొదట్లో పెండ్లి ప్రధానం చేస్తే ఒక్క రూపాయి పావలా ఇచ్చేవారు, లగ్నం చేస్తే రెండు రూపాయలు ఇచ్చారు, ఆ తర్వాత క్రమంలో 10 రూపాయలు నూట ఒక్క రూపాయి ఇచ్చేవారు ఇప్పుడు 25 వేల రూపాయలు ఇస్తున్నారు

**3) కరోనా విపత్కర పరిస్థితిలో కూడా మీరు పెళ్లిళ్లు చేశారు భయం వెయ్య లేదా**

ప్రజలు శుభకార్యం కావాలని వచ్చినప్పుడు అది కరోనా మరొకట నేను ఏది ఆలోచించను వారింట్లో శుభకార్యం జరగాలి నేను వెళ్లి చేయాల్సిందే అదే నా బాధ్యత ఏ కరోనాకు నేను భయపడలేదు అంతా దేవుడిపైనే వేశాను

**4) 72 సంవత్సరాల మీ పురోహిత్యంలో మీరు సంపాదించింది ఎంత.. ఆస్తులు అంతస్తులు ఏమన్నా కొన్నారా.!**

నా ఈన్నేళ్ల చరిత్రలో పురోహిత్యం చేసి పూట గడుపుకున్నానే తప్ప సంపాదన ఏమీ లేదు, నా పిల్లల పెండ్లిలు కూడా నా వ్యవసాయ భూమి అమ్మి పెండ్లిలు చేసిన పొట్ట బట్ట కోసమే పురోహితుడి గ్రామంలో చౌరస్తా లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజారిగా 70 సంవత్సరాలుగా ఉచిత సేవ చేస్తున్నాను

**5) నీ పురోహిత్యంలో ఎప్పుడైనా బాల్యవివాహాలు చేయాల్సి వచ్చిందా బాల్య వివాహాలపై మీ స్పందన ఏమిటి**

బాల్యవివాహాలు ఆనాడు గతంలో జరిగేటివి అది చేసిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరిగింది బాల్యవివాహాలు ఇప్పుడు జరగడం లేదు పెళ్లీడుకొచ్చిన వయసులో కూడా పెళ్లిళ్లు చేయడం లేదు వయసు దాటిన తర్వాత పెండ్లి కోసం వెతుకులాట పడుతున్నారు జనం మారిపోయారు అందరి దృష్టి సంపాదన పైనే పడింది

**6) మీ చేసిన పెండ్లి లలో ఏదైనా సందర్భంలో భార్యాభర్తలు విడిపోయినప్పుడు. ఏదో ప్రమాదంలో చనిపోయినప్పుడు మీకు ఏమనిపిస్తుంది**

నేను చేసిన పెళ్లిళ్లలో కొందరు విడిపోయినట్టుగా తెలిసినప్పుడు, ఏదైనా ప్రమాదంలో మరణించినప్పుడు నాకు తెలిస్తే నేను ఎన్నో సందర్భాల్లో మానసికంగా బాధపడ్డాను

**7) నారాయణపురం మండలంలో దక్షిణామూర్తి పంతులు వాహనం అంటే మీ లూనా ఎన్ని సంవత్సరాలుగా ఆ లూనా ని వాడుతున్నారు**

నా వాహనం లూనాని1988 లో 2200/రూపాయలకు కొన్నాను అది 2015 వరకు నడిపాను నారాయణపూర్ మండలంలో ఏ శుభకార్యం జరిగి నా లూనా పైనే వెళ్లేవాడిని 2015లో టీవీఎస్ కొన్నాను ఇప్పుడు ప్రస్తుతం నా వాహనం అదే

**8) పంతులుగారు 11వ తరగతి చదివిన మీరు ప్రభుత్వ ఉద్యోగం చేయకుండా పురోహిత్యం ఎందుకు ఎంచుకున్నారు**


ఆర్టీసీ కండక్టర్ గా ఉద్యోగానికి ప్రయత్నం చేశాను టీచర్ ఉద్యోగం కోసం హైదరాబాదులో మేళా చౌరస్తా నుంచి నడుచుకుంటూ చార్మినార్ వరకు వెళ్లాల్సి వచ్చింది ఇంత చదువుకుని ఈ ఉద్యోగాల కోసం తిరిగే కంటే నా కులవృత్తి పురోహిత్యం చేసుకొని నా భార్య పిల్లలను పోషించుకోవడమే నేలని ఆనాడు అనిపించింది అదే చేశాను

**9) పంతులుగారు మీతో చదువుకున్న మిత్రులు వాళ్ళ పేర్లు గుర్తుకు ఉన్నాయా చెప్పగలరా.! ఇప్పటికీ నీ స్నేహం కొనసాగుతుందా.!**

ఇప్పటికీ బతికున్న వారు ఉన్నారు వారిని కలుస్తూనే ఉన్నాను నా మిత్రులు దాచేపల్లిపాండయ్య, గుర్రం చంద్రయ్య, గుర్రం రామయ్య, కర్నాటి యాదగిరి, ఎం ఏ రషీద్, హామీద్, వంజరి ఇస్తారి, కుంభం మల్లారెడ్డి వీళ్లంతా నా మిత్రులు అందరూ ప్రభుత్వ ఉద్యోగస్తులే నేను మాత్రం ఇక్కడే పురోహిత్యాన్ని నమ్ముకుని బతికాను

83 సంవత్సరాల వయసులో కూడా శుభకార్యాలు నిర్వహిస్తూ ఈ వయసులో కూడా ఆరోగ్యంగా ఉన్న దక్షిణామూర్తి పంతులు నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ......

**- వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్**



# కుంభమేళ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎంపీ ఈటల

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 14... కుంభ మేళా కి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఎంపీ ఈటల రాజేందర్ ప్రమాద బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి నేరుగా ఎయిర్పోర్ట్ నుండి రాత్రి 9 గంటలకు నగరానికి వచ్చారు. వారి కుటుంబాలకి మనో ధైర్యం తెలుపుతూ వారికి అండగా ఉంటాం అని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు ఏనుగుల సుదర్శన్ రెడ్డి,వై .సత్యనారాయణ, మర్రి మోహన్ రెడ్డి, రవి నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు, రాగిరి మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి,అనిత పద్మారెడ్డి,ప్రకాష్, నాచారం డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్, అభిషేక్ గౌడ్ అంజి, రాఘవేంద్ర రెడ్డి, రవికాంత్, ఉదయ్, అమర్, వరలక్ష్మి, బాలు తదితరులు పాల్గొన్నారు.





## తిరుపరకుండ్రం మురుగన్, మధుర మీనాక్షి సేవలో పవన్ కల్యాణ్

**దక్షిణ భారతదేశ ఆలయాలను సందర్శిస్తున్న పవన్**

**నేడు మధురైన సమీపంలోని తిరుపరకుండ్రం క్షేత్ర సందర్శన**

**ఆలయంలో జనసేనాని ప్రత్యేక పూజలు.. మధుర మీనాక్షి అమ్మవారికి సారె, చీర సమర్పణ**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దక్షిణ భారతదేశ దేవాలయాల పర్యటనలో భాగంగా షష్ట షణ్ముఖ క్షేత్రాల సందర్శనకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇవాళ సాయంత్రం మధురై సమీపంలోని తిరుపరంకుండ్రం శ్రీ మురుగన్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పవన్ కళ్యాణ్ కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారి దర్శనానికి తీసుకువెళ్లారు. ఆలయంలో పవన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి విశిష్టతను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి మోకరిల్లి పవన్ కళ్యాణ్ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉన్న శివ, వైష్ణవ ఆలయాలను దర్శించుకుని పూజలు చేసి దైవాశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయం లోపలే ఉన్న వేద పాఠశాలను సందర్శించారు. పవన్ కు చిన్నారులు వేదపఠనం చేసి స్వాగతం పలికారు. అనంతరం సంప్రదాయ రీతిలో ఆయనను వేద పండితులు ఆశీర్వదించి సత్కరించారు. తిరుపరకుండ్రం మురుగన్ ఆలయ సందర్శన అనంతరం పవన్ మధుర మీనాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు. పవన్ మొక్కులో భాగంగా అమ్మవారికి సారె, చీరను, పుష్పాలు, ఫలాలను సమర్పించారు. అనంతరం పవన్ కళ్యాణ్ తో ఆలయ రుత్విక్కులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయంలోనే కూర్చుని పవన్ పరాశక్తి పారాయణం చేశారు. అనంతరం శ్రీ సోమ సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ సోమ సుందరేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో పవన్ వెంట ఆయన తనయుడు అకీరా నందన్, సన్నిహితుడు, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద సాయి ఉన్నారు.